సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం ǀ 6 ǀ జనవరి ǀ 2025



రివ్వురివ్వున..

ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి పెరగడంతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం కళకళలాడుతోంది. 8లో



వైభవంగా సుదర్శన హోమం

పెందుర్తి వేంకటాద్రిపై ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. 8లో



అంధకార 'తాండవ'ం

అనకాపల్లి జిల్లాలో మేజర్ ప్రాజెక్టు తాండవ జలాశయం డ్యామ్‌పై విద్యుత్ దీపాలు శిథిలమవడంతో అంధకారం నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహణ
- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జీఎన్ ప్రసాద్

పాడేరు రూరల్: విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈనెల 7,8,10 తేదీల్లో కొత్త పాడేరులోని విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయంలో బహిరంగ ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జీఎన్ ప్రసాద్ ఆదివారం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

అలరించిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ కళాకారులు

సీతంపేట (విశాఖ) : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం వినోదాల విందు పేరిట నిర్వహించిన కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, నాయుడు, పోర్ట్ శేషు, ఇమంది ఈశ్వరరావు, రమేష్, శివ జ్యోతి, సీత, వెంకటేశ్వరరావు, పుష్పమి, సంధ్యా ప్రియదర్శిని ప్రదర్శించిన స్కిట్స్, చెప్పిన జోక్స్ కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో జ్యోతి ప్రజ్వలన, అకౌంటెంట్ పోస్టు, ఎస్‌ఐ కానిస్టేబుల్, సుబ్బారావు పెళ్లి, సన్మానం, డాక్టర్ పేషెంట్, అమ్మాయి చుట్టూ, బెల్జియం అద్దం, మూడు మాత్రలు, పెళ్లి చూపులు, సేఫ్ ఫుడ్ కామెడీ స్కిట్స్ నవ్వులు పండించాయి. ముందుగా హరిహర నృత్య నికేతన్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు అనూష, అనన్య, శరణ్య ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్ అలరించింది.

సేంద్రియ సాగుపై అవగాహన



సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి: సేంద్రియ విధానంలో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చునని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.బాల హుస్సేన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయంపై వారం రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్టు, అజొల్లా తయారీపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించారు. చింతపల్లి డివిజన్ ఏపీసీఎన్ఎఫ్ రిసోర్స్ పర్సన్ రాజుబాబు, జీకేఎంఎస్ ప్రాజెక్టు రిసోర్స్‌అసోసియేట్ డాక్టర్ సునిల్‌కుమార్, పాలిటెక్నిక్ టీచింగ్ అసోసియేట్ బాబుజీనాయుడు పాల్గొన్నారు.



పాడేరులో ప్రహరీ లేని ఇంగ్లిష్ మీడియం బాలికల ఆశ్రమ పాఠశాల



గిరిజన విద్యాలయాల్లో భద్రత నామమాత్రం

లోపభూయిష్టంగా సెక్యూరిటీ వ్యవస్థ

చాలా చోట్ల ప్రహరీల కరువు

గాడి తప్పుతున్న విద్యార్థినుల సంక్షేమం

ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

బాలికకు భద్రతేదీ?

వరుస అఘాయిత్యాలతో కలవరం

గిరిజన బాలికల విద్యాలయాల్లో రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. లోపభూయిష్టంగా సెక్యూరిటీ వ్యవస్థ మారడంతో వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. రక్షణగా ఉండాల్సిన ప్రహరీలు చాలా చోట్ల లేకపోవడం, ఉన్నవి కూడా ఎత్తు తక్కువ కావడంతో అఘాయిత్యాలకు ఆస్కారమిస్తోంది. వరుస దారుణాలు జరుగుతున్నా.. పాలకులు ఆ ఒక్క రోజు హడావుడితోనే సరిపుచ్చుతున్నారు.

సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వంలో మహిళలు, విద్యార్థినులు, బాలికలకు రక్షణ కరువైంది. కొద్దినెలలుగా జిల్లాలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు కలవరపరుస్తున్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి గిరిజన బాలికల విద్యాలయాల్లో ఏదొక సంఘటన చోటుచేసుకుంటుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాలల్లో మాత్రమే సెక్యూరిటీ వ్యవస్థ అందుబాటులో ఉంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో లేకపోవడం అఘాయిత్యాలకు దారితీస్తోంది. వీటికి నైట్ వాచ్‌మన్‌లు ఉన్నప్పటికీ భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా సంఘటనలు చోటుచేసుకుంటున్నా.. అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

- జి.మాడుగుల మండలం బందవీధి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడు నెలల క్రితం ఓ గిరిజన బాలికను గోడ దూకించి పాడేరు తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో ఆ పాఠశాలలో భద్రత లోపం వెలుగు చూసింది. ఈ ఘటనలో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.
- పాడేరు గురుకుల బాలికల విద్యాలయంలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలలో గత నెలలో ఓ బాలికపై ల్యాబ్ ఉద్యోగి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో సెక్యూరిటీ సేవలపై విమర్శలు వెల్లువెత్తాయి. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు జైలుకు పంపారు.
- ఇటీవల జి.మాడుగులలోని గాంధీనగర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఓ గిరిజన విద్యార్థినిని ఆటోలో పాడేరు తరలించి లైంగిక దాడికి పాల్పడిన ఘటన అందరినీ బాధించింది. ఈ ఘటనలో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ప్రహరీ దూకి..

గత నెలలో పాడేరు ఏకలవ్య పాఠశాలలో గిరిజన బాలికపై ల్యాబ్ ఉద్యోగి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన గిరిజన సమాజాన్ని ఆందోళనకు గురిచేసింది. రాత్రి సమయంలో నిందితుడు ప్రహరీ దూకి పాఠశాలలో ప్రవేశించినట్టు అధికారులు నిర్ధారించారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల, ఏకలవ్య పాఠశాలల్లో సుమారు 1200మంది వరకు గిరిజన బాలికలు వసతితో కూడిన విద్యను పొందుతున్నారు. అయితే విద్యాలయాల ప్రహరీలు చాలాచోట్ల ఎత్తు తక్కువగా ఉన్నందున విద్యార్థినులు బయటకు కనిపిస్తుంటారు. ఇలాంటి పరిస్థితులు కూడా అఘాయిత్యాలకు దారితీస్తున్నాయి. ఈ ఘటన జరిగిన తరువాత కూడా ప్రహరీల ఎత్తు పెంచేందుకు తీసుకున్న చర్యలు నామమాత్రమే.

ప్లాస్టిక్ తెరలే రక్షణ..

- తలారిసింగిలోని గిరిజన సంక్షేమ ఇంగ్లీషు మీడియం బాలికల ఆశ్రమ పాఠశాలకు కూడా ప్రహరీ లేదు. ఈ పాఠశాల చుట్టూ ప్లాస్టిక్ తెరలు మాత్రమే ఉన్నందున విద్యార్థినులకు రక్షణ కరువైంది.
- జి.మాడుగుల మండలం కొక్కిరాపల్లి, హుకుంపేట మండలం పెదగరువు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు రోడ్డు పక్కనే ఉన్నాయి. అఘాయిత్యాలు జరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి చోట్ల ప్రహరీల ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎత్తులేని ప్రహరీ మధ్య పాడేరు ఏపీఆర్, ఏకలవ్య బాలికల విద్యాలయాలు

రక్షణ పటిష్టం చేస్తాం



గిరిజన బాలికల విద్యాలయాల్లో రక్షణ చర్యలు విస్తృతం చేస్తున్నాం. లైంగిక దాడి ఘటలను సీరియస్‌గా తీసుకుంటున్నాం. బాధ్యులపై ఇప్పటికే కఠిన చర్యలు తీసుకున్నాం. బాలికల విద్యాలయాల్లో సెక్యూరిటీని పెంచడంతో పాటు చుట్టూ ప్రహరీ గోడల వ్యవస్థను పటిష్టం చేస్తాం.

– వి. అభిషేక్, పీవో, ఐటీడీఏ, పాడేరు

వలసంపేటలో ప్రభుత్వ భూమి కబ్జా

- ఫిర్యాదు చేసినా నామమాత్రంగా రెవెన్యూ అధికారుల చర్యలు
- కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తా..: పెదమాకవరం ఎంపీటీసీ మల్లేశ్వరి

కొయ్యూరు: మండలంలోని కినపర్తి పంచాయతీ వలసంపేట సమీపంలో ప్రభుత్వ భూమిని గిరిజనేతరుడు దర్జాగా ఆక్రమించినా రెవెన్యూ అధికారులు చర్యలు నామమాత్రంగా ఉండడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పెదమాకవరం ఎంపీటీసీ సడ్డా మల్లేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వలసంపేట సమీపంలో సర్వే నంబర్ 51–2లో4.94 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు.గతంలో పంచాయతీ సర్పంచ్‌తో సహా అందరూ తీర్మానం చేసి ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారన్నారు. దీనిపై అప్పట్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ఇటీవల దానిని పక్కన పెట్టిన గిరిజనేతరుడు ఏకంగా ప్రభుత్వ భూమిలో పాకను వేశారని చెప్పారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే త్వరలో ఆదివాసీ జేఏసీతో కలిసి రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు.

సంక్రాంతి సంబరాలు



సన్నాయి వాయిస్తున్న కళాకారులు

ఆరిలోవ (విశాఖ): నగరంలోని ఆరిలోవలో ఆదివారంఉత్తరాంధ్ర సంగీత జానపద కళాపీఠం ఆధ్వర్యంలో టీఐసీ పాయింట్ వద్ద సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాలకు చెందిన కళాకారులను ఇక్కడకు తీసుకువచ్చారు. కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, గిరిజన కోలాటం, థింసా నృత్యం, జముకుల కథ, సన్నాయి మేళం, రాజమ్మ ఆట, నాగిని డ్యాన్స్, తుడుము మేళం, ఒడిశా గిరిజన సంస్కృతి, చెంచు నాటకం, జానపద నృత్యాలు ప్రదర్శించారు.

మన్యం వణుకుతోంది





చింతపల్లి, పాడేరు ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న పొగమంచు

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- అరకులో 6.5 డిగ్రీల నమోదు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. చలి, మంచు తీవ్రత ఎక్కువగానే ఉంటోంది. ఆదివారం అరకువేలీలో 6.5 డిగ్రీలు, హుకుంపేటలో 7.4 డిగ్రీలు, పెదబయలులో 7.4 డిగ్రీలు, అనంతగిరిలో 8.6 డిగ్రీలు, చింతపల్లిలో 9.4 డిగ్రీలు, జి. మాడుగులలో 9.8 డిగ్రీలు, కొయ్యూరులో 12.9 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ విషయాన్ని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మరియు వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలులు వీస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

సింగిల్ డిజిట్‌కు..

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు కొనసాగుతున్నాయి.గత మూడు రోజుల నుంచి పాడేరు డివిజన్ వ్యాప్తంగా సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలితీవ్రత మరింత అధికమైంది.పొగమంచుతో పాటు చలితీవ్రతకు మన్యం వాసులు వణికిపోతున్నారు.సాయంత్రం నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద ఆదివారం 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉత్సాహంగా కేరళీయుల వేడుకలు

మురళీనగర్ (విశాఖ) : నగరంలోని కేరళీయుల క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. బిర్లా కూడలిలోని కేరళ కళాసమితి ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం సమితి అధ్యక్షుడు ఏఆర్‌జీ ఉన్నిత్తన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఆర్‌కే (నాన్ రెసిడెంట్స్ కేరలైట్స్ అసోసియేషన్) డవలప్‌మెంట్ ఆఫీసర్ అను పి.చకో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేరళీయులకు, తెలుగు ప్రజలకు ఈ ఏడాదంతా విజయాలు చేకూరాలన్నారు. ఎస్ఎస్‌టీఎల్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ ఎలన్ అబ్రహం ప్రసంగించారు. మార్తోమా చర్చి ఫాదర్ బ్లెసన్, ఆర్థడాక్స్ చర్చి ఫాదర్ జిబిన్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కేరళీయులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కుమార్తెను చూసి వస్తుండగా..

- బైక్ అదుపుతప్పడంతో తండ్రి దుర్మరణం
- రోడ్డుపక్కన విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి
- పెద గెద్దాడలో విషాదఛాయలు



సతీష్‌రెడ్డి మృతదేహం

రంపచోడవరం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమార్తెను చూసి వస్తున్న తండ్రిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఆ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెద గెద్దాడకు చెందిన వ్యవసాయ కూలీ పత్రి సతీష్‌రెడ్డి (30) కుమార్తె అనారోగ్యానికి గురై రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతోంది. ఆమెను చూసేందుకు శనివారం ఆస్పత్రికి వెళ్లాడు. రాత్రి అక్కడి నుంచి స్వగ్రామం పెద గెద్దాడ బైక్‌పై బయలుదేరాడు. ఎదురుగా వస్తున్న కారు లైటింగ్‌లో బైక్ అదుపు తప్పడంతో ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ముల కొట్లాట

ఇద్దరికి తీవ్రగాయాలు



బడదాంలో జరిగిన కొట్లాటలో తీవ్రంగా గాయపడిన భార్యభర్తలు బాలురెడ్డి, రమణమ్మ

అడ్డతీగల: మండలంలోని బడదాం గ్రామంలో శనివారం రాత్రి అన్నదమ్ముల మధ్య గొడవ కాస్తా కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చెదల రమణారెడ్డి, చెదల బాలురెడ్డి అన్నదమ్ములు. మద్యం సేవించి ఉన్న వీరిద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్లాటకు దారితీసింది. అన్న రమణారెడ్డి తమ్ముడు బాలురెడ్డిని రాళ్లతో కొట్టాడు. అడ్డుకునేందుకు వెళ్లిన అతని భార్య రమణమ్మను కూడా రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. భార్యాభర్తలిద్దరు అపస్మారక స్థితికి చేరడంతో స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు 108 వాహనంలో వారిద్దరిని స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అడ్డతీగల సీఐ నరసింహమూర్తి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

ఒడిశాకు చెందిన ఇద్దరు అరెస్టు



గంజాయి నిందితులతో హుకుంపేట పోలీసులు

దుంబ్రిగుడ (హుకుంపేట): ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 16 కిలోల గంజాయిని హుకుంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాములాయి జంక్షన్ వద్ద ఎస్‌ఐ సురేష్ ఏపీ ఎస్పీ పోలీసులు, సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశాలోని జయంతి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులకు తనిఖీ చేశారు. వారి వద్ద గుర్తించిన 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితులు చంద్రసేన్ మెహర్, జయదేవ్ మెహర్ ఒడిశాలోని కలహండి జిల్లా బల్దియామాల్ గ్రామానికి చెందినవారని ఆయన తెలిపారు. చిత్రకొండ బ్లాక్ అండిగల్ గ్రామంలో తెలిసిన వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరు గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి ఆటో డ్రైవర్లు, సంతల్లో అమ్ముతుంటారని, అందునిమిత్తం తీసుకువెళ్తున్నారని ఎస్‌ఐ వివరించారు.



వంజంగి హిల్స్‌లో అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి

మన్యానికి పోటెత్తిన పర్యాటకులు

కిటకిటలాడిన సందర్శన ప్రాంతాలు

సాక్షి,పాడేరు: మన్యానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. దీంతో సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వంజంగి హిల్స్‌లో సూర్యోదయం, పొగమంచు అందాలను వీక్షించారు. ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు నుంచి వంజంగి హిల్స్‌కు కాలినడకన చేరుకున్నారు.

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి నెలకొంది. వాతావరణంలో మార్పులు కారణంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో మంచు దట్టంగా కరుస్తోంది. దీంతో పర్యాటకులు రద్దీ పెరిగింది.



చాపరాయి పర్యాటక కేంద్రం ముఖద్వారం వద్ద పర్యాటకులు



డుడుమ జలపాతం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి

ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకించారు. తాజంగి జలాశయానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. జిప్‌లైనర్, బోటు షికార్ చేస్తూ సందడి చేశారు.

దుంబ్రిగుడ: మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. చాపరాయి జల విహారి, అరకుపైనరీ సందర్శకులతో సందడి నెలకొంది. చాపరాయి జలవిహారీలో స్నానాలు చేస్తూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. అరకు పైనరీలో పైన్ వృక్షాల మధ్య ఫొటోలు దిగారు. వన భోజనాలు చేశారు.

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం డుడుమ జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా తరలిరావడంతో సందడి నెలకొంది. ఇక్కడికి సమీపంలోని జోలాపుట్టు జలాశయం, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, దేసిమా మ్యూజియాన్ని సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి నెలకొంది.

సాయంకాలం..సాగరతీరం



విశాఖ సాగర తీరంలో ఆదివారం సాయంత్రం నగరవాసులు సరదా...సరదాగా గడిపారు. కొత్త సంవత్సరంలో తొలి ఆదివారం కావడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులతో బీచ్‌లో సందడి చేశారు. ఆర్కే బీచ్ నుంచి రుషికొండ తీరం వరకు సాగర తీరం సందడిగా మారింది. చిన్నారులు ఆర్కే బీచ్‌లో గుర్రాలపై స్వారీ, రంగుల రాట్నం, ఇసుకలో ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. సముద్ర తీరంలో రాళ్లపై యువత సెల్ఫీలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో ఫొటోలు తీసుకుంటూ, ఆదివారం ఎంజాయ్ చేశారు. భారీగా నగరవాసులు, పర్యాటకులు తీరానికి రావడంతో సందడి నెలకొంది.

– ఏయూ క్యాంపస్ (విశాఖ)

క్లుప్తంగా

7న అనకాపల్లిలో జాబ్‌మేళా

తుమ్మపాల: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 7న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన 20 నుంచి 26 సంవత్సరాల వయస్సు గల యువతీయువకులకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిఫరెన్స్ సంఖ్యతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో జాబ్‌మేళాకు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, మరింత సమాచారం కోసం 8143229228 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం ప్రమాణ స్వీకారం

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవనంలో జరిగింది. సంఘ సభ్యులు సమక్షంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సొనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. సంఘ సభ్యులైన గిరిజన ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ, రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జమ్ముకశ్మీర్‌పై చండీగఢ్ విజయం

విశాఖ స్పోర్ట్స్ : విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ డి పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చండీగఢ్ ఏడు వికెట్ల తేడాతో జమ్ముకశ్మీర్‌పై విజయం సాధించింది. ఓపెనర్ల జోడీ సెంచరీలతో సహా తొలి వికెట్‌కు 237 పరుగుల భాగస్వామ్యంతో గట్టి పునాది వేసింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జమ్ముకశ్మీర్ కెప్టెన్ డోగ్రా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు మొగ్గుచూపాడు. దీంతో జేకే జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 285 పరుగులు చేసింది. అర్ధసెంచరీ చేసిన ఓపెనర్ శుభమ్ కజూరియా(72) మరో ఓపెనర్ విగ్రాంత్(21)తో 56 పరుగులు, ముసైఫ్(20)తో కలిసి రెండో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. నాజిర్(28)–సాహిల్(22) జోడి ఆరో వికెట్‌కు 51 పరుగులు అందించగా, ముస్తాక్ (53), రషిక్ (21) జోడి అజేయంగా 67 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. నిషంక్ మూడు వికెట్లు తీయగా నిఖిల్ రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా చండీగఢ్ ఓపెనర్లు మనన్ వోరా(107) తుషార్ జోషి(131) తొలి వికెట్‌కు 237 పరుగులు జోడించారు. శివమ్ 27 పరుగులతో, కౌశిక్ 8 పరుగులు చేసి 42.5 ఓవర్లలోనే జట్టును విజయతీరానికి చేర్చారు. సునీల్ రెండు వికెట్లు తీశాడు. ఆదివారంతో లీగ్ దశ పోటీలు ముగిశాయి. గ్రూప్ డిలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ విదర్భ విజయం సాధించి 24 పాయింట్లతో నేరుగా నాకవుట్‌కు చేరింది. గ్రూప్ బిలో ఆడిన ఆంధ్ర నాలుగు విజయాలు మూడు పరాజయాలతో 16 పాయింట్లతో లీగ్ దశలోనే వెనుతిరిగింది.

రివ్వురివ్వున..!

డిసెంబర్‌లోనూ వృద్ధి సాధించిన విశాఖ ఎయిర్‌పోర్టు





డిసెంబర్‌లో ప్రయాణికులు, విమాన సర్వీసుల రాకపోకలు

దేశీయ ప్రయాణికుల రాకపోకలు		అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు	
2023 డిసెంబర్‌లో	213711	2023 డిసెంబర్‌లో	5600
2024 డిసెంబర్‌లో	263705	2024 డిసెంబర్‌లో	12042
వృద్ధి రేటు	23,39 శాతం	వృద్ధి రేటు	115.04 శాతం

దేశీయ విమాన సర్వీసుల రాకపోకలు		అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలు	
2023 డిసెంబర్‌లో	1546	2023 డిసెంబర్‌లో	38
2024 డిసెంబర్‌లో	1874	2024 డిసెంబర్‌లో	82
పెరిగిన సర్వీసులు	328	పెరిగిన సర్వీసులు	44
వృద్ధి రేటు	21.22 శాతం	వృద్ధి రేటు	115.79 శాతం

- 2023 డిసెంబర్‌తో పోలిస్తే 23 శాతం పెరిగిన స్వదేశీ ప్రయాణికులు
- డొమెస్టిక్ విమాన సర్వీసుల్లోనూ 21.22 శాతం వృద్ధి
- విదేశీ ప్రయాణికులు, సర్వీసులు ఏకంగా 115 శాతం పెరుగుదల

సాక్షి, విశాఖపట్నం : శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి పెరగడంతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం కళకళలాడుతోంది. విశాఖ నుంచి రాకపోకలు సాగించే వారి సంఖ్య ఊపందుకుంది. 2023 డిసెంబర్‌తో పోలిస్తే.. 2024 డిసెంబర్ నెలలో దేశ, విదేశీ ప్రయాణికుల రాకపోకలతో పాటు విమాన సర్వీసుల్లోనూ గణనీయంగా వృద్ధి సాధించింది.

వింటర్ సర్వీసులు పెరగడంతో..

చలికాలం అంటేనే పర్యాటకులకు పండగ. అందుకే విభిన్న మార్గాల్లో విమానయానాన్ని అందుబాటులోకి తీసుకొస్తూ.. ఆయా సంస్థలు తమ సర్వీసులను పెంచాయి. 2023 శీతాకాలంలో 32 సర్వీసులు ఇక్కడ నుంచి నడవగా.. ఈ ఏడాది 3 సర్వీసులు అదనంగా పెరిగాయి. మొత్తం 35 విమానాలు విశాఖ నుంచి శీతాకాలంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, చెన్నై, జైపూర్, పోర్ట్‌బ్లెయిర్, కర్నూలు, కోల్‌కతా, తిరుపతి, ముంబై తదితర నగరాలకు రాకపోకలు జరుగుతున్నాయి. ఇందులో కొన్ని రోజువారి సర్వీసులుండగా.. మరికొన్ని వారంలో మూడు రోజుల పాటు నడుస్తున్నాయి. వీటితో పాటుగా ఇంటర్నేషనల్ సర్వీసులు కూడా అదరగొడుతున్నాయి. 2023 శీతాకాలంలో విదేశాలకు ఒకే ఒక్క సర్వీసు సింగపూర్‌కు మాత్రమే ఉండేది. ఇప్పుడు మలేషియా(కౌలాలంపూర్), బ్యాంకాక్‌కు ఇంటర్నేషనల్ సర్వీసుల పెరగడం.. ఈ సర్వీసులు కూడా కళకళలాడుతుండటం కలిసొచ్చిన అంశం. ఈ వృద్ధి ఇదే తరహాలో కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. సమ్మర్ షెడ్యూల్ టైమ్‌కు మరిన్ని సర్వీసులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

డిసెంబర్‌లో అదరగొట్టింది

డిసెంబర్ నెలలో విశాఖ ఎయిర్‌పోర్టు అదరగొట్టింది. ప్రయాణికుల రాకపోకలు, విమాన సర్వీసుల పరంగా విశాఖ ఎయిర్‌పోర్టు మంచి ఫలితాలు రాబట్టుకుంది. స్వదేశీ ప్రయాణికుల రాకపోకల్లో 2023 డిసెంబర్‌తో పోలిస్తే ఈ సారి 23.39 శాతం వృద్ధి సాధించింది. అదేవిధంగా.. డొమెస్టిక్ విమాన సర్వీసుల్లోనూ 21.22 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇక అంతర్జాతీయ పాసింజర్ల విషయంలోనూ అదే జోరు కొనసాగింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో ఏకంగా 115.04 శాతం వృద్ధి నమోదవ్వగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లోనూ 115.79 శాతం నమోదైంది. గతంతో పోలిస్తే పోలిస్తే అదనంగా సర్వీసులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం.



రాకపోకలు సాగిసున్న ప్రయాణికులు

క్రాస్‌కంట్రీ స్టేట్ చాంప్ విశాఖ



ఓవరాల్ చాంపియన్ సాధించిన విశాఖ అథ్లెట్లు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. ప్రవల్లిక, మేరీగ్రేస్, వేదవ్యాస్ ఆయా కేటగిరిల్లో విజేతలుగా నిలిచి జట్టుకు చాంపియన్‌షిప్ అందించారు. విశాఖ జిల్లా అథ్లెట్లు మొత్తంగా 24 పాయింట్లతో చాంపియన్‌షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. అండర్ 16 బాలికల రెండు కిలోమీటర్ల పరుగులో బి.ప్రవల్లిక విజేతగా నిలవగా.. అండర్ 18 బాలికల నాలుగు కిలోమీటర్ల పరుగులో రాగిణి, వుమెన్–20 ఆరు కిలోమీటర్ల పరుగులో హాసిని తృతీయ స్థానాల్లో నిలిచారు. వుమెన్–10 కిలోమీటర్ల పరుగులో ఎల్.మేరీగ్రేస్ తొలి స్థానంలో నిలవగా దివ్యదుర్గ ద్వితీయ, జ్యోతిదుర్గా తృతీయ స్థానాల్లో నిలిచారు. మెన్–10 కిలోమీటర్ల పరుగులో ఎం.ఎస్.జె.వేదవ్యాస్ తొలి స్థానంలో నిలవగా రమేష్ తృతీయ స్థానంలో నిలిచాడు. అండర్–20 మెన్ ఎనిమిది కిలోమీటర్ల పరుగులో చిన్నా తృతీయ స్థానంలో నిలిచాడు. వీరందరిని జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

మిషన్ వాత్సల్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ : జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రొటక్షన్ ఆఫీసర్ 01, డాక్టర్ (పార్ట్‌టైం) 01, ఆయా 01 పోస్టు భర్తీ చేయనున్నారు. 25–42 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులు. అర్హత గల అభ్యర్థులు జి ఇజ://రిజీట్బ జుజ్బి ఖ్బ ఖ్రుఖ్బ.ౖ ఇ:జౌరి.జీ ౹ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 18వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో గల జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో అందజేయాలి.

అంధకార 'తాండవ'ం

- శిథిలమైన తాండవ గట్టుపై విద్యుత్ లైట్లు
- పొద్దుపోతే చిమ్మచీకట్లో అందాల తాండవ
- పర్యవేక్షణ లేక ఎండుతున్న మొక్కలు
- తగ్గిన సందర్శకుల రాక

నాతవరం (అనకాపల్లి): జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు గట్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు శిథిలం కావడంతో అంధకారంలో ఉంటుంది. తాండవ ప్రాజెక్టు ఒక పక్క రెండు జిల్లాలు పరిధిలో వేలాది మంది రైతులకు వరి పంట సాగు చేసుకునేందుకు సాగు నీరు సరఫరా చేస్తుంది. మరో పక్క నిత్యం వేలాది మంది మనస్సు దోచే విధంగా పర్యటకులకు ఆహ్లాదాన్ని నింపుతుంది. గతంలో సందర్శకులను ఆకట్టుకునే విధంగా అప్పటి ప్రాజెక్టు డీఈ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో తాండవ రిజర్వాయరు గట్టుపై కుండీలు ఏర్పాటు చేసి అందంగా కన్పించేలా వివిధ జాతులు మొక్కలు ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టు తిలకించేందుకు వచ్చే సందర్శకులు అందంగా ఉండే మొక్కల వద్ద ఫొటోలు సెల్ఫీలు తీసుకొని సరదాగా గడిపేవారు. అధికారులు పర్యవేక్షణ లేక నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం తాండవ ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు పూర్తిగా శిథిలమై మచ్చుకైనా కన్పించడం లేదు. అలంకారం ప్రాయంగా మొక్కలు లేకుండా కుండీలు కూడా శిథిలమై అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తాండవ ప్రాజెక్టు చూడటానికి వచ్చే సందర్శకులు ఇక్కడ అధ్వాన పరిస్థితులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైట్లు కొంతకాలంగా వెలగకపోవడంతో వాటికి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో పొద్దుపోతే తాండవ ప్రాజెక్టుపై అంధకారం రాజ్యమేలుతుంది. గతంలో ఇక్కడ ప్రత్యేకంగా ఒకరు పర్యవేక్షణ ఉండేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎవరూ ఉండడం లేదని స్థానికులు అంటున్నారు. తాండవ ప్రాజెక్టును చూసేందుకు ఎవరైనా ఉన్నతాధికారులు లేక ప్రజాప్రతినిధులు వస్తేనే ప్రాజెక్టు అధికారులు ప్రత్యక్షం అవుతున్నారని, లేకపోతే ఎవరూ కనిపించరని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంధకారంలో ఉన్న తాండవ ప్రాజెక్టు గట్టుపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే మొక్కలు శిథిలమై అలంకార ప్రాయంగా కన్పించే కుండీలలో మొక్కలు వేసి తాండవకు పూర్వ వైభవం తీసుకురావాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



మొక్కలు ఎండిపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న తాండవ గట్టుపై కుండీలు

వైభవంగా సుదర్శన హోమం

- శ్రీవారికి ఘనంగా పుష్పయాగం
- భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజ
- వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన వేంకటాద్రి



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: గోవింద నామస్మరణతో పెందుర్తి పులకించింది. భక్తజనంతో వేంకటాద్రి పోటెత్తింది. పెందుర్తి వేంకటాద్రిపై ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఉత్సవాల్లో 21వ రోజు పూజలో తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో వెంకన్న దర్శనమిచ్చారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం అనంతరం, అష్టోత్తర పూజ జరిపి, మంగళహారతి ఇచ్చారు. గోపూజ, గోదాదేవి సన్నిధిలో వ్రతం నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శనహోమం చేశారు. ఘనంగా పూర్ణాహుతి జరిపారు.

ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో దాదాపు 1500 మంది మహిళలతో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. గోపూజ భక్తిశ్రద్ధలతో జరిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి తీసుకువచ్చిన వివిధ రకాల పూలతో స్వామిని అభిషేకించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. వేల మంది భక్తులు వెంకన్న ప్రసాదం స్వీకరించారు. గోవింద నామస్మరణతో వేంకటాద్రి మార్మోగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు, నగరం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు, పలువురు ప్రముఖులు స్వామివారిని, గోదాదేవిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు శ్రీవారి సేవకులు ప్రసాద వితరణ చేపట్టారు.

ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం వేంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. శ్రీవారి సేవకులు ఆద్యంతం విశేష సేవలందించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, పలువురు నాయకులు, అధికారులు, వేలాదిగా భక్తులు తరలివచ్చి క్రతువులో పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల




పాల్గొన్న భక్తులు



పుష్పయాగానికి రాష్ట్రం నలుమూలల నుంచి తీసుకువచ్చి సిద్ధంగా ఉంచిన పూలు

ఘనంగా దేవానంద స్వామీజీ ఆరాధనోత్సవాలు

దేవరాపల్లి: సద్గురు దేవానంద సరస్వతి స్వామీజీ మహరాజ్(రుషీకేష్) 25వ ఆరాధన మహోత్సవాలు కొత్త పెంటలోని ఆశ్రమంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7న ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వేడుకలను నిర్వహించనున్నారు. తొలి రోజు ఆదివారం రుషీకేష్ నుంచి వచ్చిన పద్మనాభానంద స్వామీజీతో పాటు పలువురు సాధు సంతులు దేవానంద స్వామిజీ విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.రాత్రి భజన కార్యక్రమాలను, భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఆఖరి రోజు ఈ ఆరాధన మహోత్సవానికి దేశ వ్యాప్తంగా స్వామీజీ భక్తులు, శిష్యులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, దేవానంద స్వామి ఆధ్యాత్మిక జీవన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



దేవానంద స్వామీజీని దర్శించుకుంటున్న పద్మనాభానంద స్వామీజి, సాధు సత్‌పురుషులు



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న పద్మనాభానంద స్వామీజీ

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

బీచ్ హ్యాండ్ బాల్ పోటీల విజేత విశాఖ

అచ్యుతాపురం : రాష్ట్ర స్థాయి బీచ్ హ్యాండ్ బాల్ పోటీల విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. అచ్యుతాపురం మండలంలోన పూడిమడకలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బీచ్ హ్యాండ్ పోటీల్లో తొలి స్థానం విశాఖపట్నం, రెండో స్థానం కర్నూల్, మూడో స్థానం ప్రకాశం జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.13 జిల్లాలకు చెందిన 150 మంది పాల్గొన్న ఈ జట్లలో ప్రతిభ కనబరిచిన 16 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. కమిటీ పర్యవేక్షణ పూర్తి చేసిన తర్వాత సోమవారం ఉదయం తుది జట్టును ప్రకటించనున్నారు. కార్యక్రమాల్లో బీచ్ హ్యాండ్ బాల్ అసోషియేషన్ సీఈఓ గోపి, రామకాసు, ప్రవీణ్, చేపల వెంకటరమణ, మేరుగు బాపునాయుడు, జనపరెడ్డి శ్రీనివాసరావు, మోటూరు శ్రీవేణి పాల్గొన్నారు.



గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు

మంచు మనోహరం



రాజవొమ్మంగిలో కురుస్తున్న మంచు

- మలయమారుతంలా వీస్తున్న చల్లగాలులు
- ఉదయం 9 గంటలైనా కానరాని సూరీడు
- రోజువారీ పనులకు ఆటంకం

రాజవొమ్మంగి: మన్యప్రాంతంలో ఎటువైపు వెళ్లినా దట్టమైన మంచు కురుస్తు పరిసర ప్రాంతాలను మనోహరంగా మార్చివేస్తున్నాయి. దట్టంగా అలముకొంటున్న మంచు తెరలు ఓ వైపు, విపరీతమైన చలి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా సూర్యుడి వెలుగులకు నోచుకోని ప్రజలు ఇళ్లకే పరిమితమౌతున్నారు. చలిమంటను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు చలిని లెక్కచేయని రైతన్నలు వేకువజామునే పొలాలకు వెళ్లి పనుల్లో నిమగ్నమవుతున్నారు. దట్టమైన పొగమంచు వాహనచోదకులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు, మనుషులు కనిపించక ఇబ్బందిపడుతున్నారు. మన్యంలో కురుస్తున్న మంచు అందాలను వీక్షించేందుకు తరలివచ్చిన పర్యాటకులు చలిలో ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆనందంగా గడుపుతున్నారు.



మంచులో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు



సారీడు గూడుపై మంచు పరదాలు